హైదరాబాద్ వార్త



# కాంగ్రెస్ బరిలో.. ఎవరెవరు?



**వాస్తం శ్రేణుల్లో ఉత్కంఠ**

## అభ్యర్థుల విడుదలకు మొదలైన కసరత్తులు
## సర్వే నివేదికల ఆధారంగానే టికెట్ కన్ఫర్మ్
### వారంలో మొదటి జాబితా, మూడు విడతల్లో జాబితాలు

**ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలి అన్న నిర్ణయంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏ ప్రాతిపదికన టికెట్లను కేటాయిస్తారన్న అంశం సర్వత్రా చర్చనీయాంశం అవుతుంది. సర్వేల ఆధారంగా అయితే చాలా మంది సీనియర్లకు అవకాశం దక్కకపోవచ్చు అని పార్టీ శ్రేణులు అంటున్నాయి. పైరవీల ద్వారా అయితే పలువురు సీనియర్లు, ముఖ్యమైన నాయకులకు టికెట్లు వచ్చే అవకాశం ఉంది. కానీ గెలవడం, సాధ్యం కాదు అని అంటున్నారు. మొత్తం గ్రేటర్ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ జాబితా కోసం ఆ పార్టీ శ్రేణులే కాకుండా ఇతర పార్టీల వారు, రాజకీయ నిపుణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.**

హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మొదటి జాబితా ఈనెల మొదటి వారంలో ఎంపిక విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే పలుమార్లు నిర్వహించిన సర్వేలు, ఇతర నివేదికల ఆధారంగా క్యాండిడేట్ల వివరాలు సేకరించిన ఆ పార్టీ అధిష్టానం పోటీ చేయడానికి ఆసక్తి ఉన్నవారి నుంచి ఇటీవలే దరఖాస్తులు స్వీకరించింది. ఈ క్రమంలో ఆయా నియోజకవర్గాల నుంచి దరఖాస్తు పెట్టుకున్న వారి వివరాలు, సర్వేలు క్రోడీకరించి తుది జాబితాలను రూపొందించినట్లు సమాచారం. ప్రతి నియోజకవర్గం నుంచి ఇద్దరి పేర్లు ఫైనల్ చేస్తున్నట్లు పార్టీ వర్గాలు, పలువురు నాయకులు చర్చించుకుంటున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా సునీల్ కనుగోలు సర్వే రిపోర్టుతో పాటు ఆయన ఇచ్చే వ్యూహం, టఫ్ ఫైట్ ఉంటుందని భావించే నియోజకవర్గాల్లో మరో సంస్థతో చేయించుకుంటున్న సర్వే తదితరాలన్నింటి ఆధారంగా ఫైనల్‌గా అభ్యర్థులను ఏఐసీసీ ఖరారు చేయనున్నది. గతంలో నాలుగు విడతలుగా జాబితాలను విడుదల చేసిన ఏఐసీసీ ఈసారి ఎలా ఫైనల్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. గతంతో పోలిస్తే ఈసారి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో.. గ్రూపు తగాదాలు, వర్గాల ఘర్షణ లేకుండా పకడబ్బందీ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు.



ఈనెల మొదటివారంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించే జాబితాలో ఐదు నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పెద్దగా సమస్యలు లేని నియోజకవర్గాలకు మొదటి విడతగా అభ్యర్థులను ప్రకటించనున్నట్లు సమాచారం. మొదటి విడత జాబితాలో ముషీరాబాద్, ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, నాంపల్లి, అంబర్‌పేట నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, ఎల్బీనగర్ నుంచి మధుయాస్కీ గౌడ్, ఇబ్రహీంపట్నం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, నాంపల్లి నుంచి ఫిరోజ్‌ఖాన్, అంబర్‌పేట నుంచి నూతి శ్రీకాంత్‌గౌడ్ పేర్లు ఖరారు అవకాశాలు. మొదటి జాబితా అనంతరం కొంత సమయం తీసుకొని కాంగ్రెస్ పార్టీ మిగిలిపోయిన నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించనున్నట్లు సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. పాతబస్తీలో పెద్దగా ఆశావహులు లేకున్నా శివారు ప్రాంతాల సెగ్మెంట్ల నుంచి ఎక్కువగా ఉన్నారు. ఉప్పల్ నుంచి పరమేశ్వర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, కుత్బుల్లాపూర్ నుంచి కొలను హనుమంతరెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి, రాజేంద్రనగర్ నుంచి జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, కస్తూరి నరేందర్, శేరిలింగంపల్లి నుంచి జెరిపేటి జయపాల్, సత్యనారాయణ, ఎం.రఘునాథ్‌యాదవ్, మలక్‌పేట నుంచి సంగిరెడ్డి, చెకొలేకర్ శ్రీనివాస్, ఖైరతాబాద్ నుంచి రోహిణ్‌రెడ్డి, విజయారెడ్డి, జూబ్లీహిల్స్ నుంచి అజారుద్దీన్, విష్ణువర్ధన్‌రెడ్డి, సనత్‌నగర్ నుంచి మర్రి ఆధిత్యారెడ్డి, కోట నీలిమ, డాక్టర్ రవీందర్‌గౌడ్, సికింద్రాబాద్ నుండి నాగులూరి సాయిబాబా, ఆదం సంతోష్‌కుమార్, నోముల ప్రకాశ్‌గౌడ్, కూకట్‌పల్లి నుంచి గొట్టిముక్కల పద్మారావు, సత్యం శ్రీరంగం, కంటోన్మెంట్ నుంచి సర్వే సత్యనారాయణ, పిడమర్తి రవి, జీవకన్‌లు టికెట్లు ఆశిస్తున్నవారిలో ఉన్నారు. మల్కాజ్‌గిరి విషయానికి వస్తే బిఆర్‌ఎస్‌ను వీడి బయటకు వస్తే మైనంపల్లి హనుమంతరావును ఇక్కడి నుంచి పోటీకి దింపే అవకాశాలు లేకపోలేదు. లేనిపక్షంలో నందికంటి శ్రీధర్ పేరు ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయి. మహేశ్వరంలో ఇదే పరిస్థితి ఉంది. అక్కడ గులాబి పార్టీకి గుడ్‌బై చెప్పి వచ్చే తీగల కృష్ణారెడ్డి అభ్యర్థిత్వాన్ని ఫైనల్ చేసే అవకాశాలు ఉన్నాయి. లేనిపక్షంలో చల్ల నర్సింహారెడ్డి, పారిజాత నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డిలలో ఒకరికి టికెట్టు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## బిజెపిలో బీసీలకు పరాభవం?

- పార్టీలో వేగంగా మారుతున్న సమీకరణలు
- పార్టీలోకి వస్తున్న బిసిలను అడ్డుకుంటున్న నేతలెవరు?



బేగంపేట సెప్టెంబరు 1, ప్రభాతవార్త : రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామంటూ బిజెపి కేంద్ర, రాష్ట్ర నాయకులు ప్రకటనలు చేస్తూ నియోజకవర్గాల్లో నాయకులను సమాయత్తం చేయాలంటూ చేసిన సూచనలు ఒకలా ఉంటే రాష్ట్రంలో తాజా పరిస్థితులు మరోలా ఉన్నాయి. గ్రేటర్ ఎన్నికల్లో జోరు చూపించిన బిజెపిలో తాజాగా జరుగుతున్న పరిణామాలు గమనిస్తుంటే ఆ పార్టీ బీసీలకు దూరంగా జరుగుతుందా..వారిని దూరం చేసుకునే దిశగా అడుగులు వేస్తుందా అన్న అపోహలకు తావిస్తున్నట్లుగా ఉంటున్నాయి తాజా పరిస్థితులు. రాష్ట్రంలో బీజేపీ నాయకత్వం మార్పు తరువాత పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు అందరూ కలిసి ఒకే తాటిపై నడిచిన వారిలో ఒక్కో సామాజిక వర్గం కమలం నుంచి చేజారిపోతున్నట్లుగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర పార్టీ వైఖరి బిసిలను ఆపార్టీకి దూరం చేసుకుంటున్నట్లుగా కనిపిస్తుంది. ఇప్పటి వరకు కీలకంగా ఉన్న బీసీ నేతలు కొందరు మౌనం వహాయిస్తుండటం, ఇటీవల పార్టీలోకి వచ్చేందుకు కొందరు ఆసక్తి చూపుతున్నా అలాంటి నేతలను ఆహ్వానించడంలో రాష్ట్ర నాయకత్వం ఆలస్యం చేస్తుండటం, ఈ ఊహాగానాలకు మరింత ఊపునిచ్చినట్లుగా కన్పిస్తుంది. పార్టీలో చేరేందుకు ఆసక్తిగా ఉన్న వారిని అడ్డుకునేందుకు మోకాలడ్డుతున్న నేతలెవరూ అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితులలో రాష్ట్రంలో బలంగా ఉన్న అధికార బిఆర్‌ఎస్‌ను ఎలా ఎదుర్కొంటుంది. ఇది ఎంత వరకు సాధ్యపడుతుంది. ఇలాంటి పరిణామాలలో అధికారం దిశగా బిజెపి చేస్తున్న పోరాటం విజయం సాధించే దిశగా సాగుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు కొన్ని నియోజకవర్గాల్లో రానున్న ఎన్నికల్లో పోటీచేయనున్నట్లు ప్రచారం జరుగుతున్న వారి పేర్లను సైతం పరిశీలించినట్లైతే రాష్ట్ర నాయకత్వం కేవలం ఒక సామాజిక వర్గానికే పెద్ద పీట వేస్తుందా.. ఇలా అయితే ఆ పార్టీలో ఎన్నో ఏళ్లుగా ఉంటూ ఆటుపోట్లు ఎదుర్కొన్న మిగిలిన సామాజిక వర్గాలకు చెందిన నాయకుల మాటేంటి. అన్న సందేహాలను పలువురు నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొన్ని సామాజిక వర్గాలకు చెందిన నేతలు సైతం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం గమనార్హం. మరి ఇలాంటి పరిస్థితి నుంచి రాష్ట్ర బిజెపిని గట్టెక్కించే నేతలు ఎవరు. ఒంటెద్దు పోకడలతో రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో అధికారంలోకి తీసుకు రావడం సాధ్యమేనా, అన్న అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. జీహెచ్‌ఎంసీ ఎన్నికల వరకు ఎంతో దూకుడు మీదున్న బీజేపీ తాజా పరిణామాలతో ఒక్క సారిగా డీలా పడిపోవడానికి కారణం ఒక సామాజిక వర్గం దూకుడే మిగిలిన వారికి అడ్డుకట్ట వేస్తుందా.. ఇలాంటి పరిస్థితుల నుంచి రాష్ట్ర పార్టీని గట్టెక్కించడంలో కేంద్రం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీటిని కాదని పార్టీలో అంతర్గత కుమ్ములాటలు కూడా పార్టీకి మరింత తలనొప్పిగా మారాయి. గ్రేటర్‌లో అత్యధిక నియోజకవర్గాల్లో ఒకే సామాజిక వర్గానికి చెందిన రెండు మూడు పేర్లు వినిపిస్తుండటం బిసిలకు బిజెపికి మరింత దూరం పెంచేలా కనిపిస్తున్నాయి.

## ప్రేమోన్మాది ఘాతుకం

జగద్గిరిగుట్ట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : ప్రేమించలేదని కోపొద్రిక్తుడైన ఓ యువకుడు ప్రేమించిన యువతిపై దాడి చేసిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టలో నివాసం ఉంటున్న లీలానాగజ్యోతి ఓ పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ ఉపాధి పొందుతుంది. కాజీపేటకు చెందిన రాజు అనే యువకుడు విజయనగర్‌కాలనీలో నివాసం ఉంటూ ఎలక్ట్రిషియన్ పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. రాజు కొంత కాలంగా నాగజ్యోతిని ప్రేమిస్తున్నానంటూ వెంటపడడంతో ఆమె నిరాకరించింది. దీంతో ఆమెపై కోపం పెంచుకున్న రాజు శుక్రవారం పాఠశాల నుండి వస్తున్న నాగజ్యోతిపై కత్తితో దాడి చేసి అనంతరం తాను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఇరువురిని చికిత్స కోసం వైద్యశాలకు తరలించారు. గాయపడిన ఇద్దరి పరిస్థితి సాదరణంగా ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొంటున్నారు

## సెల్లారులో అగ్ని ప్రమాదం
### కాలి పోయిన ద్విచక్ర వాహనాలు

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబరు 1 ప్రభాతవార్త : షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ అపార్టుమెంట్‌లోని సెల్లారులో జరిగిన అగ్ని ప్రమాదంలో తొమ్మిది ద్విచక్ర వాహనాలు, కారు కాలి పోయిన సంఘటన శుక్రవారం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పర్‌పల్లి గ్రీన్ రెసిడెన్సీ అపార్టుమెంట్ సెల్లారులోని పార్కింగ్‌లో వాహనాలను పార్కింగ్ చేశారు. శుక్రవారం ఉదయం ఆరున్నర గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మంటలు కారణంగా తొమ్మిది ద్విచక్ర వాహనాలు, కారు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక కేంద్రానికి చెందిన సిబ్బంది అపార్టుమెంట్‌లోని సెల్లారుకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉంచ వచ్చు నని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసును రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గోడ పత్రిక ఆవిష్కరణ

కంటోన్మెంట్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: ఎం.సి.హెచ్. తొలి మేయర్ కొర్వి కృష్ణ స్వామి 130వ జయంతి వేడుకలను పురస్కరించుకొని రూపొందించిన గోడపత్రికను శుక్రవారం మహేంద్రహిల్స్‌లో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొర్వి కృష్ణ స్వామి సేవా సమిత రాష్ట్ర అధ్యక్షుడు పిట్ల నాగేశ్ మాట్లాడారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు
### నిందితుని వద్ద 2.82కిలోల గంజాయి స్వాధీనం

దుండిగల్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఓడిస్సాకు చెందిన అనూప్(26) సెంట్రింగ్ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. చెడు వ్యసనాలకు బానిసైన అనూప్ అక్రమ మార్గాన డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయాన్ని ఎంచుకున్నాడు. ఓడిస్సాలోని కొనుగోలు చేసిన గంజాయిని దుండిగల్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈక్రమంలో శుక్రవారం భౌరంపేటలోని స్నేక్‌పార్క్ వద్ద అనూప్ గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న మేడ్చల్ డివిజన్ ఎస్‌వోటి, దుండిగల్ పోలీసులు అతన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద 2.82 కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు.

**గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్**

**ధర్నాచౌక్..** అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని గాంధీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. గాంధీనగర్ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం బన్సీలాల్‌పేటకు చెందిన మహ్మద్ ఫయాజ్ (30) ఫ్లవర్ డెకరేటర్‌గా పనిచేసేవాడు. ఫయాజ్ బన్సీ లాల్‌పేటలో కూరగాయల వ్యాపారి దినకర్ అనే వ్యక్తి దగ్గర తక్కువ ధరకు గంజాయి కొని, ఎక్కువ ధరకు అవసరమైన వారికి అమ్ముతూ ఉండేవాడు. సమాచారం తెలుసుకున్న గాంధీ నగర్ పోలీసులు శుక్రవారం గాంధీ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫయాజ్ ను పట్టుకున్నారు. ఫయాజ్ వద్ద నుండి 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## పర్యాటకులకు గుడ్ న్యూస్
### చార్మినార్ వద్ద మూడంతస్తుల కార్ల పార్కింగ్ బిల్డింగ్

హైదరాబాద్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త : పర్యాటకులకు గుడ్ న్యూస్. ఇకపై చార్మినార్ చూసేందుకు వచ్చే పర్యాటకులకు పార్కింగ్ కష్టాలు తీరనున్నాయి. కుటుంబ సమేతంగా, ఫ్రెండ్స్‌తో కలిసి చార్‌మినార్ వంటి చారిత్రక కట్టడాన్ని చూడాలనుకున్న వారికి ఎన్నో ఏళ్లుగా పార్కింగ్ సమస్య వెంటాడుతూ వస్తోంది. వాహనాలు పార్కింగ్ చేసేందుకు స్థలం లేక పర్యాటకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకపై ఏలాంటి పార్కింగ్ సమస్య ఉండదు. చార్‌మినార్‌కు నలువైపుల నుంచి పర్యాటకుల కోసం మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. చార్మినార్ ఆర్టీసి బస్ డిపో సమీపంలో సౌకర్యవంతమైన పార్కింగ్ ఏర్పాటు చేయనున్నారు. పార్కింగ్ సౌకర్యం కోసం పెరుగుతున్న డిమాండ్‌కు ప్రతిస్పం దనగా పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ (పిపిపి) ద్వారా ఈ ప్రాజెక్టు స్థాపించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆసక్తిగల పార్టీల నుంచి బిడ్లను ఆహ్వానిస్తున్నట్లు కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రకటించింది. సెప్టెంబరు 16న బిడ్డింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్‌ను సుమారు 3,493 చదరపు మీటర్ల విస్తీర్ణంలో మూడు బేస్‌మెంట్ స్థాయిలో మూడు అంతస్తుల్లో నిర్మించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ కాంప్లెక్స్‌లో దాదాపు 150 ఫోర్ వీలర్ వెహికిల్స్, టూ వీలర్ పెయిడ్ పార్కింగ్ స్థలాలు ఉంటాయి. అదనంగా బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్లలో హాకర్ల కోసం వాణిజ్య స్థలాలు కేటాయిం చనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత నగరం సమగ్ర అభివృద్ధికి ప్రాథమిక ఏజెన్సీగా పనిచేస్తున్న కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు ఈ కాంప్లెక్స్‌ను పిపిపి పద్ధతి ద్వారా నిర్మించాలని నిర్ణయించారు.

## రెండు లక్షల విలువ గల అక్రమ మందులు సీజ్

హైదరాబాద్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త: పేద, సామాన్య ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉచితంగా మందులను సరఫరాచేస్తున్న అక్రమంగా అమ్ముకుంటున్న సంఘటన సికింద్రాబాద్‌లో చోటుచేసుకుంది. నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ అధికారులు తెలిపిన వివరాలు ప్రభుత్వం అందించే ఉచిత మందులను అక్రమంగా అమ్ముతున్న సికింద్రాబాద్‌లోని వారాసిగూడ హెల్త్ ఫస్ట్ మెడికల్ షాప్‌ను మూసివేశామని తెలిపారు. ఈ షాపులో దాదాపు రూ.2లక్షల విలువలగల అక్రమ మందులను సీజ్ చేసినట్లు తెలిపారు. పక్కా సమాచారం ప్రకారం మెడికల్ షాప్‌పై దాడులు చేసిన అధికారులు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చేమందులను అక్రమంగా మెడికల్ షాపులో నిలువ చేసి. అమ్ముత్తున్నట్లుగా గుర్తించామని డ్రగ్‌కంట్రోల్ అధికారి గోవింద్ తెలిపారు. ఈ షాపులో దాదాపు రూ.2లక్షల విలువైన మందులను నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు వివరించారు. అయితే ఈ మందులను ఎక్కడ నుంచి తీసకొస్తున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అక్రమ డ్రగ్ రహిత తెలంగాణ సాధించడమే లక్ష్యంగా తాము దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.





మాదాపూర్‌లోని హెచ్ఐసిసిలో జరిగిన తెలంగాణ వజ్రోత్సవ వేడుకల్లో కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి

## విద్యార్థులు నైతిక ప్రవర్తనతో ఎదగాలి
### దగ్గుబాటి సురేష్‌బాబు



నిజాంపేట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని విఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఇన్‌డక్షన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞానజ్యోతి సంస్థ అధ్యక్షులు దగ్గుబాటి సురేష్‌బాబు మాట్లాడుతూ తమ కళాశాలలో ర్యాగింగ్ వంటి ఇబ్బందులకు తావులేదని, విద్యార్థులు తమ మనస్తత్వానికి , వ్యక్తిత్వానికి, లక్ష్యాలకు తగిన స్నేహితులను ఎంచుకొని నైతిక ప్రవర్తనతో ఎదిగితే రానున్న కాలంలో సునాయసంగా విజాయాలను సొంతం చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు యాజమాన్యం అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచుతుందని, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో తమ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శేషగిరిరావు, సంచాలకులు డా.చెన్నకేశవరావు, అకాడమిక్స్ డీన్ డా.కె.అనురాధ, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైభవంగా మార్కండేయ స్వామి రధయాత్ర



మార్కండేయ స్వామి రధయాత్రలో పాల్గొన్న చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్,బిఆర్ఎస్ నాయకులు పుస్తె శ్రీకాంత్ తదితరులు

చార్మినార్,సెప్టెంబరు 1 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ దూద్‌బౌలిలో శ్రావణ మాసం సందర్భంగా శ్రీ మార్కండేయ బాల భక్త సమాజం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా శ్రీ మార్కండేయ స్వామి రధయాత్ర జరిగింది. దూద్‌బౌలిలోని బటన్ ఫ్యాక్టరీ నుంచి ప్రారంభమైన రథ యాత్ర కబూతర్‌ఖనా, సిప్లిగంజ్, సాల్ట్ ఫ్యాక్టరీ, గొల్లకిడికి పలు ప్రాంతాలలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి రాపోలు భాస్కర్ రావు, బిజెపి నాయకులు డాక్టర్ భగవంత్‌రావు, కార్పొరేటర్ పావనీ వినయ్ కుమార్, పురానాపూల్ కార్పొరేటర్ సున్నం రాజ్ మోహన్, చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్, హుస్సే నీఆలం సిఐ నాగేశ్వర్‌రెడ్డి, హైదరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం బిఆర్‌ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీకాంత్, మార్కండేయ బాల భక్త సమాజం ప్రతినిధులు డి.శంకర్, భరత్, రామచందర్ డి.రాజ్‌కుమార్, చంద్రశేఖర్, దుర్గేష్ కుమార్, వీరేష్, వెంకటేష్, దామోధర్ పాల్గొన్నారు.

## లక్ష్మీ కటాక్షంతో ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలి



యూసుఫ్‌గూడ మహమూద్ ఫంక్షన్ హాల్‌లో శ్రావణ మాసం శుక్రవారం మంగళగౌరీ, వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న నియోజకవర్గం సీనియర్ బిజెపి మహిళా నాయకురాలు జూటూరు కీర్తిరెడ్డి

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త : పవిత్రమైన శ్రావణ మాసం 3వ శుక్రవారం కావడం తో శ్రీలక్ష్మీ కటాక్షంతో ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ నియోజకవర్గం సీనియర్ మహిళా బిజేపి నాయకురాలు జూటూరి కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున శ్రీమంగళగౌరీ, వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. శుక్రవారం యూసుఫ్‌గూడ మహ్మద్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు 5వందల మంది మహిళలతో వ్రతంను నిర్వహించి అనంతరం వారికి పసుపు కుంకుమలతో పాటు చీరలను పంపిణీ చేశారు.

## తెలంగాణ ఉద్యమ చరిత్రను నేటి యువతరం అవగాహన చేసుకోవాలి
### తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ ఎం.కోదండరామ్



ప్రసంగిస్తున్న తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ ఎం.కోదండరామ్

చిక్కడపల్లి, సెప్టెంబరు 1 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమ చరిత్రను నేటి యువతరం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. శుక్రవారం అశోక్ నగర్‌లో అమిగోస్ ఐఏఎస్ అకాడమి ఆధ్వర్యంలో 40 రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన 'తెలంగాణ ఉద్యమ చరిత్ర' అంశంపై ఉచిత తరగతుల ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ముఖ్యంగా నిరుద్యోగ యువతీ యువకులు ఎవరైతే గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్నారో వారంతా తెలంగాణ ఉద్యమ చరిత్రను తెలుసుకోగలిగే అవకాశం లభించిందని అన్నారు. ఈ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారంతా మొదట ఉద్యమ స్వరూపం గురించి అవగాహన పెంచుకున్న తర్వాతనే ఇతర పుస్తకాలను చదవాలన్నారు. ఏ పుస్తకమైతే సంపూర్ణంగా సమాచారం ఇస్తుందో అటువంటి చరిత్ర కలిగిన పుస్తకాలను ఒకటికి పదిసార్లు చదవాలని అన్నా రు. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు తెలంగాణ రాష్ట్ర భౌగోళిక స్వరూపం, తెలంగాణలో మతాలు, కులాలు, ఆశ్రిత కులాలు, గిరిజన తెగలు, పండుగలు, జాతరల గురించి వివరించారు.

## కెసిఆర్ కృషితోనే పరుగులు పెడుతున్న అభివృద్ధి
### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో రూ.6.30కోట్ల హెచ్ఎండిఏ నిధులతో చేపడుతున్న రోడ్డు పనులకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, సెప్టెంబరు 1 ప్రభాతవార్త : సీఎం కేసీఆర్ కృషి వల్లనే రాష్ట్రంలో అభివృద్ధి పను లు పరుగులు పెడుతున్నాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు నుంచి కిస్మత్‌పూర్ చౌరస్తా వరకు హెచ్‌ఎండిఏ నిధులు రూ.6.30కోట్లతో నిర్మిస్తున్న పనులకు మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ రాజేందర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలకిచ్చిన ప్రతీ వాగ్ధానాన్ని చేతల్లో చేసి చూపించామన్నారు. ముఖ్యంగా మౌళిక వసతులైన తాగునీరు, డ్రైనేజి, వీధి దీపాలు, సీసీ రోడ్లు, బిటి రోడ్లు, పార్కులు, స్మశాన వాటికలు వంటి పనులకు అధిక ప్రాధాన్యతనిచ్చి, యుద్ధ ప్రాతిపాదికన పనులు పూర్తి చేయించామన్నారు. ఓఆర్ఆర్ నుంచి కిస్మత్‌పూర్‌కు వెళ్లే రహదారి గోతులు పడి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, హెచ్‌ఎండిఏ అధికారులపై ఒత్తిడి పెంచి నిధులు మంజూరు చేయించామన్నారు. ప్రజల కోసం ఎంత వరకైనా తెగించి పోరాడుతామని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ శరత్‌చంద్ర, సహకార సంఘం అధ్యక్షులు రాందాస్ ముదిరాజ్, బిఆర్‌ఎస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు నిఖిల సంగారెడ్డి, ప్రశాంత్ నాయక్, సాగర్‌గౌడ్, అస్లాం, నాయకులు పాపయ్య యాదవ్, పాండు, రాజిరెడ్డి, ఖాజా, రజాక్, హెచ్‌ఎండిఏ అధికారులు అప్పారావ్, ముక్రంఅలీ, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణి

హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్‌లో ఎంపిక చేసిన 12వేల లబ్ధిదారులకు 2023 సెప్టెంబర్ 2వ తేదీన డబుల్ బెడ్ డ్రూమ్ ఇళ్లను పంపిణి చేసేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం మొదటి విడతలో 11వేల 700 ఇళ్లను పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. మొత్తం ఐదు లేదా ఆరు విడతల్లో పంపిణి పూర్తి చేసేందుకు కసరత్తు పూర్తి చేస్తామని వెల్లడించారు. ఇప్పటి వరకు 70వేల ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా..మిగితా ఇళ్ల నిర్మాణ దశలో ఉన్నాయి. కుత్బుల్లాపూర్‌లో మంత్రి కెటిఆర్, శేరిలింగంపల్లిలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, కొల్లూరులో మంత్రి హరీష్‌రావు, మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డి, ఉప్పల్‌లో మేయర్ గద్వాల విజయలక్ష్మీ, ప్రతాపసింగారంలో డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్, మహేశ్వరంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పాతబస్తీలో మంత్రి మహమూద్ అలీ, రాజేంద్రనగర్‌లో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిలు మొదటి విడత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణిలో పాల్గొననున్నారు.

## రూ.7 కోట్ల 90లక్షలతో ఆర్‌కెపురం చెరువు సుందరీకరణ పనులు : ఎమ్మెల్యే మైనంపల్లి



చెరువు సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**నేరెడ్‌మెట్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధిపర్చి రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని నేరెడ్‌మెట్‌డివిజన్ ఆర్.కెపురంలో రూ. 7కోట్ల 90లక్షలతో చెరువు సుందరీకరణ పనులను అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్.కె పురం పూర్తి స్థాయిలో సుందరీకరించి త్వరగా పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. డివిజన్ ప్రజలకు సాయంత్రం సమయంలో ప్రశాంతమైన వాతావరణంలో వాకింగ్ చేసేందుకు వీలుగా తగు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ అధికారులు జగన్మోహన్, శివకుమార్‌రెడ్డి, నాయకులు ఉపేందర్‌రెడ్డి, కరంచంద్, జి.ఎస్.వి.సతీష్, పిట్ల శ్రీనివాస్, నిరంజన్, గోకుల్‌కుమార్, చెన్నారెడ్డి, రాజు, యాదగిరి, శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిధి అధ్యాపక ఉద్యోగానికి దరఖాస్తులు స్వీకరణ

**నేరెడ్‌మెట్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** నేరెడ్‌మెట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిధి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శైలజ పేర్కొన్నారు. కళాశాలలో ఆంగ్లసబ్జెక్టు భోదించడానికి ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 5వతేదీలోపు కళాశాల కార్యాలయంలో తమ బయోడేటా అందించాలని సూచించారు. అతిధి అధ్యాపక పోస్టు కళాశాల నియమ నిబంధనలకు అనుగూణంగా నియమించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు పీజిలో 55%మార్కులు, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులైతే 50% ఉత్తీర్ణత ఉండాలన్నారు. బోధనానుభవం గల అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. వివరాలకు కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ సంగి రమేష్‌ను సంప్రదించాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన సదస్సు




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం పోలీసులు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వనస్థలిపురం డివిజన్ షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు షీ టీం వ్యవస్థ, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణ, సిసి కెమెరాల ఆవశ్యకత, బాల్య వివాహాలు, బాల కార్మిక నిర్మూలన చట్టాలు, కమ్యూనిటీ పోలీసింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీవితంలో మంచి, చెడు మార్గాల గురించి కూడా వారికి వివరించారు. డయల్ 100, షీ టీం నెంబర్, రాచకొండ వాట్సాప్ నెంబర్లను విద్యార్థులకు తెలియజేసి అవసరమైన సమయంలో ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్ఐ ప్రమోద్‌కుమార్‌కు రాచకొండ సి.పి డి.ఎస్. చౌహాన్ అభినందన



ఆర్ఐ ప్రమోద్‌కుమార్‌ను అభినందిస్తున్న రాచకొండ సి.పి డి.ఎస్ చౌహాన్..

**నేరెడ్‌మెట్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** ఎన్ఎండిసి, హైదరాబాద్ రన్నర్స్ సం యుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మారథాన్ పోటీల్లో రాచకొండ పోలీస్ కమీ షనరేట్‌లో ఆర్ఐగా విధులు నిర్వహించిన డి.ఆర్.ప్రమోద్‌కుమార్ 42.195 కిలోమీటర్ల దూరాన్ని 4గంటల 44నిమిషాల్లోనే పూర్తిచేసి విజేతగా నిలిచా రు. ఈ సందర్భంగా శుక్రవారం రాచకొండ పోలీస్ కమీషనరేట్ కార్యాలయం లో ప్రమోద్‌కుమార్‌ను పోలీస్ కమీషనర్ డి.ఎస్ చౌహాన్ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని విజ యాలు సాధించాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. భవిష్యత్తులో తోటి ఉద్యోగు లకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## బిఎల్ఆర్‌కు ఉప్పల్ నేతల సంఘీభావం



బండారి లక్ష్మారెడ్డిని సత్కరిస్తున్న మేకల హనుమంతరెడ్డి తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** ఉప్పల్ బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేషన్ మేకల అనల హనుమంతరెడ్డి తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ మేరకు ఉప్పల్‌లో జరిగిన సమావేశంలో బిఆర్ఎస్ నేతలు మేకల హనుమంతరెడ్డి, గోనె అర్జున్‌రెడ్డి, మేకల మధుసూధన్‌రెడ్డి,మధుసూధన్‌రెడ్డి, రంగ భాస్కర్‌గౌడ్, శివ, సలీం తదితరుల శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్‌లో బిఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. బిఆర్ఎస్ పార్టీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. పార్టీలోని అందరిని కలుపుకునిపోతూ ముందుకుసాగుతానన్నారు. అదేవిధంగా రామంతాపూర్ డివిజన్ మాజీకార్పొరేటర్ గంధం జ్యోష్ణ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు బండారి లక్ష్మారెడ్డిని కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో అవకతవకలను సరిదిద్దండి : సామ రంగారెడ్డి



వినతి పత్రం అందజేస్తున్న సామ రంగారెడ్డి, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** ఓటరు జాబితాలో జరుగుతున్న అవకతవకాలను అరికట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం సూపరిండెంట్ అధికారికి ఈ మేరకు శుక్రవారం ఓటర్ జాబితా అవకతవకలపై ఒక నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 73 వేల ఇళ్లను వెరిఫై చేసి ఓటరు జాబితాలో జరుగుతున్న అవకతవకలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని న్నారు. ఈ విషయమై విధికా అధికారులు వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి నాయకులు కళ్లెం వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వంశీ, జోషి పాల్గొన్నారు.

## మట్టి గణపతి నిర్మాణానికి ఎమ్మెల్యే పూజలు



పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** గడ్డిఅన్నారం డివిజన్ కమలానగర్ కాలనీలో ఏర్పాటుచేసే 33 అడుగుల మట్టిగణపతి విగ్రహం నిర్మాణానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం పూజలు నిర్వహించారు. శ్రీమణికంఠ అయ్యప్ప భక్త సమాజం కన్వీనర్ తులసి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 33అడుగుల మట్టిగణపతి భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్ తులసి శ్రీనివాస్, అధ్యక్షులు రాజుకుమార్, ఉపాదక్షులు బాబూరావు, ప్రధానకార్యదర్శి నాగేంద్రకుమార్, కోశాధికారి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ పటిష్టత కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలి : కటకం నర్సింగరావు

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** పార్టీ పటిష్టత కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి సీనియర్ నాయకుడు కటకం నర్సింగరావు పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ ఇంద్రప్రస్థ కాలనీ బూత్ నెంబర్లు 102,103,104 బిజెపి అధ్యక్షులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీ నాయకులు పటిష్టంగా పనిచేస్తేనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. పలు అంశాల గురించి ఆయన దిశనిర్దేశణ చేశారు. ఈ సమావేశంలో కాలంశెట్టి లయ, రాధిక, శక్తి కేంద్ర ఇంచార్జ్ బుశెట్టి చంద్రశేఖర్, బూత్ సబ్యులు పాల్గొన్నారు.

## జీవిత భీమాతో కుటుంబాలలో సంతోషం

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** జీవితాలకు బీమా సౌకర్యం కల్పించి ఆ కుటుంబాలలో సంతోషాన్ని నింపుతున్నామని ఐడిబిఐ డిజిఎం మురళీధర్ పేర్కొన్నారు. భారతీయ జీవిత భీమా సంస్థ 67వ ఇన్సూరెన్స్ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్ ఎల్ఐసి సిటీ బ్రాంచ్ కార్యాలయంలో బ్రాంచ్‌మేనేజర్, సిబ్బంది, ఏజెంట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మురళీధర్ హాజరై భీమా వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలసీదారులకు మరిన్ని సేవలను నూతన సర్వీసులను అందజేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 9కోట్ల పాలసీలతో వెయ్యి కోట్లు నాన్ సింగిల్ ప్రీమియంతో సౌత్ సెంట్రల్ జోన్ ఆల్‌ఇండియాలో ముందు ఉన్నందున అభినందనలు తెలిపారు. ఎల్ఐసి పాలసీలు ఒక చిన్న దేశం జనాభాకు సరిపోతుందని బ్రాంచ్ మేనేజర్ బి.సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ యూనియన్ గజానంద్, శోభ, విద్యావతి, ఏజెంట్స్, యూనియన్ లియాఫీ వినాయకులు కృష్ణారావు, రామస్వామి, సుబ్బారావు,రామ్మోహన్‌రావు, మల్లేష్, శ్యామయ్య, సుదర్శన్, రాంబాబు, లియాఫీ ప్రెస్ పబ్లిసిటీ చైర్మన్ జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ అంజిరెడ్డి కాలనీలో విగ్రహ పునః ప్రతిష్టాపన పూజలు ప్రారంభం

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** బాలాపూర్ అంజిరెడ్డినగర్‌లోని శ్రీ కంఠ మహేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్టాపన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు, దాతల సహాయ సహకారాలతో నిర్మించిన ఈ దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కంఠ మహేశ్వరస్వామి సూరమాంబ అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ నేపథ్యంలో 3రోజుల పాటు వేద పండితులు పొన్నూరు భార్గవ శర్మ, దేవగిరి సంతోష్‌శర్మల ఆధ్వర్యంలో శుక్రవారం గణపతి పూజలతో ప్రతిష్టాపనోత్సవ పూజలను ప్రారంభించారు. ఆదివారం హోమాలు నిర్వహించి సోమవారం విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలను నిర్వహిస్తారు.

## కొత్తపేట డివిజన్‌లో అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పరిశీలించారు. ప్రజానివాస్ ఫేస్ 1లో స్ట్రామ్‌వాటర్ డ్రైనేజ్ పనులు, కొత్తపేట గ్రామం న్యూమారుతినగర్ వార్డు కార్యాలయం ఎదురుగా సిసి రోడ్డు పనులు, ఎస్ఆర్ఎల్ కాలనీలో సీసీరోడ్డు పనులు వేగవంతంగా చేయాలని ఎవరికీ ఇబ్బందులు కలవకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ మాతృనాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఆర్ఎల్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్, ప్రజానివాస్ సెక్రటరీ ప్రసాద్, నాయకులు సుందర్‌నారాయణ, గట్టు మహేష్‌కుమార్, సంగ్రామ్, వెంకటేష్ పాల్గొన్నారు.

## కొత్త ఓటర్ల నమోదుపై విద్యార్థులకు అవగాహన : తహసీల్దార్ వెంకటనరసింహారెడ్డి

**ఉప్పల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** ఉప్పల్ మండల పరిధిలో కొత్త ఓటర్ల నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ వెంకటనరసింహారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రామంతాపూర్‌లోని మెఘా డిగ్రీ కళాశాలలో కొత్త ఓటర్ల నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, చిరునామా మార్పులు, తొలగింపు తదితర సేవలు పొందవచ్చని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉంటారని, బూత్ లెవల్ అధికారిని సంప్రదించాలని సూచించారు. శని, ఆదివారం కూడా ప్రత్యేక డ్రైవ్ సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ రఫీ, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## బిఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరోగ్య కార్డులు




ఆరోగ్య సేవా కార్యక్రమాలను పరిశీలిస్తున్న బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** బిఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా ఆరోగ్య కార్డులు జారీ చేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్‌లో బిఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా ఆరోగ్యసేవ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా పేదలకు ఆరోగ్య కార్డులు జారీ చేయడంతోపాటు, కుటుంబం మొత్తానికి రూ.ఐదు లక్షల వరకు వైద్య అందిస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబ సభ్యునికి వేరు వేరు కార్డులు జారీ చేస్తారని, తెల్ల రంగు రేషం కార్డు ఉన్న ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దీంతో పాటు నియోజకవర్గంలోని కొత్త ఓటర్లు కూడా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ బిఆర్ఎస్ నేతలు ఆకుల మహేందర్, అన్య బాలకృష్ణ, ఈగ సంతోష్, సుక్క కిరణ్, బి.నిరంజన్‌చారి, చింతల నరసింహారెడ్డి, పంగ మహేందర్‌రెడ్డి, బోరంపేట రవి, మేకల సర్వారెడ్డి, కాయల చందు, అల్వాల నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, కిషోర్, వినోద్‌రెడ్డి, రాంరెడ్డి, కమ్మ లక్ష్మణ్, మంద లక్ష్మణ్, మస్తాన్, కృష్ణామాచారి, సతీష్, నవీన్‌చారి, రోశయ్య, రాజిరెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## అన్న ప్రసాదానికి రూ.25 వేల నగదు వితరణ

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** అన్ని దానాలకన్నా అన్నదానం మహా గొప్పదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని ఉపేందర్‌రెడ్డి నివాసంలో శుక్రవారం నిత్యఅన్నదాన సత్రానికి రూ.25 వేల చెక్కును మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రఖ్యాతిగాంచిన అహోబిల నరసింహస్వామి క్షేత్రంలో మద్యం నరసింహులు ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీమత్ పెద్దఅహోబిల లక్ష్మినరసింహ నిత్యాఅన్నసత్ర సంఘానికి విరాళాన్ని అందజేసినట్లు చిలుక తెలిపారు. ఈ కార్యక్రమంలో అజయ్‌రెడ్డి, మురళీ, నగేష్, విజయ్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్తికేయనగర్ బ్రిడ్జి నిర్మాణం పనులు త్వరలో పూర్తి : కార్పొరేటర్ శాంతిశేఖర్



బ్రిడ్జి నిర్మాణం పనులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ శాంతిశేఖర్

**నాచారం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** నాచారం కార్తికేయనగర్ బ్రిడ్జి నిర్మాణం పనులు త్వరలో పూర్తి కానున్నాయని కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించి కార్పోరేటర్ మాట్లాడుతూ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయన్నారు. ఇప్పటికే పూర్తి కావాల్సిన పనులను కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆలస్యమైందన్నారు. దీంతో కాంట్రాక్టర్‌పై కార్పోరేటర్ ఆగ్రహం వ్యక్తం చేసి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిదంగా నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ పనులు కూడా త్వరలో పూర్తి చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, కాంట్రాక్టర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ శివసాయినగర్‌లో ఉపాకర్మ, యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాలు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** మీర్‌పేట్ శివసాయినగర్ కాలనీలోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వరస్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో నూతన వటువులకు ఉపాకర్మ, నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం ఘనంగా జరిగింది. శ్రీ గాయత్రీ సేవా సంఘం ఆధ్వర్యంలో వేద పండితుడు బ్రహ్మశ్రీ దేవరకొండ లక్ష్మీనర్సింహశాస్త్రి ఈ కార్యక్రమాన్ని శాస్త్రబద్ధంగా జరిపారు. ఈ సందర్భంగా నూతన వటువులకు ఉపకర్మచేసి యజ్ఞోపవీత ధారణ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మీ గణపతిరావు, ఆలయ కమిటీ సభ్యులు వెంకట కృష్ణారావు, వెంకట రమణ, గాయత్రీ సేవా సంఘం ప్రతినిధులు శ్రీనివాస ప్రసాద్, శేషుబాబు, శివరామ ప్రసాద్, లక్ష్మీ నర్సింహమూర్తి, లక్ష్మణరావు, జొన్నలగడ్డ రవికుమార్, రామచంద్రరావు, బాపిరాజు, విశ్వనాథబాబు, శ్రీనివాసరావు, శ్రీనివాసాంజనేయశాస్త్రి, వెంకట గంగా రామకృష్ణ, హయగ్రీవశర్మ, పార్థసారథి, చంద్రకాంత్, ప్రసాదరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్



రవికాంత్‌కు రాఖీ కడుతున్న చైర్‌పర్సన్ అనితానాయక్



విద్యానంద్‌కు రాఖీ కడుతున్న లలిత



వాసుదేవరెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు

**మలక్‌పేట, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** సోదర బావానికి ప్రతికగా రక్షాబంధన్ నిలుస్తుందని వికలాంగుల సంక్షేమ శాఖ చైర్మన్ డాక్టర్ వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. వికలాంగుల సంఘం అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, వసంత అంధురాలు నాగరాణి తదితరులు చైర్మన్ వాసుదేవరెడ్డికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నామన్నారు. దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి అభ్యున్నతికి పాటుపడతామన్నారు.

**మలక్‌పేట్ మార్కెట్‌లో..** మలక్‌పేట్ మహబూబ్ మాన్షన్ మార్కెట్ కార్యాలయంలో రక్షాబంధన్ పురస్కరించుకుని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనిత నాయక్ డైరెక్టర్ లలితలు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మహిళా రవికాంత్, బట్కిరి విద్యానంద్, నరేష్ తదితరులకు రాఖీలను కట్టి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్షాబంధన్ వేడుకలు సోదర భావానికి అర్థం పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## కోటి 20లక్షలతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** వనస్థలిపురండివిజన్ పలు కాలనీలలో అభివృద్ధి పనులకు గతంలో కోటి 20 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయని అట్టి పనులకు ఎల్బీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా ఎఫ్.సీ.ఐ.కాలనీలో 60 లక్షల 20 వేలతో సీ.సీ.రోడ్డు, జహంగీర్‌నగర్‌కాలనీలో 60 లక్షల రూపాయల వ్యయంతో సి.సి.రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరుగుతుందని, ముందుగా త్రాగునీరు, డ్రైన్స్, రోడ్లకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మిగతా పనులు కూడా ప్రాధాన్యత క్రమంలో చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్దే తన లక్ష్యమని తెలిపారు. అలాగే ఎల్.బి.నగర్ నియోజకవర్గానికి దాదాపు 4752 డబల్ బెడ్ రూమ్స్ ఇండ్లు మంజూరయ్యాయని రెండు రోజుల క్రితం కలెక్టర్ కార్యాలయంలో 500 మందికి లక్కీ డ్రా తీయడం జరిగిందని, ప్రతాప్ సింగారం దగ్గర డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరయ్యాయని విడతల వారిగా డ్రాలు తీయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటేశ్వర రెడ్డి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ బారాస అధ్యక్షులు చింతల రవికుమార్. నాయకులు కుంట్లూరు వెంకటేష్ గౌడ్, లగ్గోని శ్రీధర్ గౌడ్, వేములయ్యగౌడ్, ఖైసర్, మధుగౌడ్, గడాల రాజు, జైపాల్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పథకాలపై యూత్ నేతల ప్రచారం

**ఉప్పల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఎస్సీఎస్టీ డిక్లరేషన్‌పై ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కరిపె సంతోష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కంది శ్రవణ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ ఇంచార్జీ ప్రీతి, యూత్ కార్యదర్శి వంజరి సంతోష్‌కుమార్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం చిలుకానగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని, ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించి పార్టీని గ్రామ స్థాయిలో మరింత ముందుకు తీసుకుని వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నేతలు వెంకట్‌రెడ్డి, యశ్వంత్, కరిపే మల్లికార్జున్, పవన్,నవీన్, పవన్‌కుమార్‌రెడ్డి, అలీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలి



శ్రావణ పౌర్ణమి పూజలు చేసిన పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** ప్రతి మనిషి ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలని శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ పిలుపునిచ్చారు. మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్‌లోని శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠంలో స్వామీజీ మంగళ శాసనములతో శ్రావణ పౌర్ణమి, రక్షా బంధన్ మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గోపాలకృష్ణానంద స్వామీజీ పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బాబాకు రాఖీ కట్టి పండుగ ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన అనుగ్రహభాషణం చేస్తూ నేటి మనుష్యుల్లో స్వార్థ చింతన ఎక్కువైం దనీ దీని ప్రభావం సమాజంపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఠం మాతాజీ మల్లాది విజయశ్రీ, సాయిభక్తులు సాయి లలిత్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య భారత వజ్రోత్సవ ముగింపు వేడుకలకు తరలిన కార్పొరేటర్లు

**ఉప్పల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్వాతంత్ర భారత వజ్రోత్సవ ముగింపు వేడుకలకు పలువురు కార్పొరేటర్లు, నాయకులు తరలివెళ్లారు. మాదాపూర్ హైటెక్స్‌లో జరిగిన వజ్రోత్సవ ముగింపు కార్యక్రమంలో చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్ పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వతంత్ర భారత సమజ్వల తెలంగాణ సాధనే లక్ష్యంగా కెసిఆర్ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు కొండల్‌రెడ్డి, ఏదుల కొండల్‌రెడ్డి, బింగి శ్రీనివాస్, ఎం.డి.షఫీ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## అవయవ దానం మరొకరికి ప్రాణదానం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విజయరంగా

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** తెలంగాణ శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లయన్ డాక్టర్ కాటగడ్డ భారతి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న అవగాహన సదస్సు కొత్తపేట న్యూమారుతినగర్ సంక్షేమ సంఘం భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట జోన్ చైర్మన్ డాక్టర్ బి.విజయరంగ మాట్లాడుతూ అవయవదానం చేయండి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని, పలు విషయాల గురించి పలువురికి అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట టిఆర్ఎస్ అధ్యక్షులు రాహుల్ గౌడ్, ఉపాధ్యక్షుడు పిట్టల అంజయ్య, న్యూమారుతినగర్‌కాలనీ అధ్యక్షుడు కృష్ణమూర్తిగౌడ్, కొమ్ము బాబు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ లబ్దిదారులను ఎంపిక చేసిన అధికారులు

**ఉప్పల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని ఉప్పల్, కాప్రాసర్కిల్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ఉప్పల్ సర్కిల్‌లో 250 మంది, కాప్రా సర్కిల్‌లో 250మందిని అధికారులు ఎంపిక చేశారు. అధికారులు లబ్దిదారుల ఎంపిక పూర్తి చేయగా, ఎంపిక చేసిన వారికి ప్లాట్ల కేటాయింపు శనివారం కాప్రా శ్రీరాంనగర్‌కాలనీలో జరిగే కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి చేతులమీదుగా చేస్తామని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించిన వారికి ఇప్పటికే సమాచారం అందించామని, నోటీసు బోర్డులలో కూడా లిస్ట్‌లు పెట్టినట్లు తెలిపారు. ఎంపికైన వారు తమ ప్లాట్లు పొందవచ్చని అధికారులు తెలిపారు. శనివారం కాప్రా శ్రీరామ్‌నగర్‌లో జరిగే డ్రా కార్యక్రమానికి లబ్దిదారులు హాజరుకావాలని సూచించారు.